క్లుప్తంగా

కోళ్లఫారం నిర్మాణంపై చర్యలు తీసుకోండి



రాయపర్తి : మండలంలోని పన్యానాయక్ తండాలో చేపట్టిన కోళ్లఫారం నిర్మాణాలను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్‌కు ఎంపీటీసీ భూక్యా క్రాంతి, భూక్యా రాజారాం నాయక్ వినతిపత్రం అందజేశారు. తొలుత హుస్సేన్‌నాయక్‌ను క్రాంతి, రాజారాం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం కోళ్లఫారాల నిర్మాణంతో తండా వాసులకు ఎదురయ్యే సమస్యలను వివరించారు. తండావాసులు వ్యతిరేకంగా నిర్మాణాలు చేపడుతున్నారని వాపోయారు. నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని కోరారు.

ఆర్థికసాయం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్త బండారి లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు శనివారం రూ.48 వేల నగదు, క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. అనంతరం లక్ష్మణ్ కుటుంబాన్ని పరామర్శించారు., కార్యక్రమంలో ఎంపీటీసీ నాగరబోయిన మమత మోహన్, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జంగా రంగారెడ్డి, ఉప సర్పంచ్ జంగా రాజిరెడ్డి, నాయకులు గుడిపెల్లి జనార్ధన్‌రెడ్డి, నాతి వెంకటేశ్వర్లు, నల్ల శ్యాంసుందర్, నర్ర రమణారెడ్డి, సాంబయ్య, రఘుపతి, బోళ్ల రవి, కుమారస్వామి, బాల్‌రెడ్డి, చెప్యాల రాజు, వేణు, సుఖజీవన్, మల్లయ్య, కృష్ణారెడ్డి, కన్నెబోయిన రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బియ్యం..



చెన్నారావుపేట : మండలంలోని జల్లి గ్రామానికి చెందిన మహ్మద్ సైదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు 50 కిలోల బియ్యం అందజేశారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాదావత్ బాలు, నాయకులు అంబాల శ్రీను, వంగపండ్ల చిన్న రాజు, ఆకుల మహేశ్, భద్ర స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నర్సంపేట : పట్టణంలోని జ్యోతిబసు నగర్ కాలనీకి చెందిన కందికట్ల అజయ్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. అనంతరం ఆర్థికసాయం అందజేశారు. తొలుత అజయ్ చిత్రపటానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తదనంతరం రమేశ్ మాట్లాడారు. యువత ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా చైతన్యంతో ఎదుర్కోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కుక్కల యాకయ్య, మోటం సురేశ్, బండారు మల్లేశ్, ఈర్ల రాజు, రతన్, సతీశ్, పవన్, అంజి, ఖాజా, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

నివాళి



ఖానాపురం : మండలంలోని కొత్తూరుకు చెందిన ఐలయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య శనివారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ లక్ష్మణ్, నాయకులు స్వామి, భూస అశోక్‌యాదవ్, చంద్రయ్య, శంకర్, రమేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

పోడు పేరిట చెట్ల నరికివేత

గూడూరు: మండలంలోని భూపతిపేట సమీపంలో జాతీయ రహదారి పక్కనున్న ఫారెస్టులో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం పోడు పేరిట చెట్లను నరికివేశారు. వివరాలిలా.. మిర్యాలపెంట సెక్షన్ పరిధిలోని భూపతిపేట శివారు 1037 కంపార్ట్‌మెంట్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. ఎఫ్ఆర్వో సురేశ్ తన సిబ్బంది వెళ్లి నరికిన చెట్లను పరిశీలించారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి జగ్గయ్య, బీట్ అధికారి కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారానికే వన్నె తెచ్చేలా..

ఏపుగా పెరిగిన జామాయిల్ మొక్కలు

- 2016 నుంచి సమష్టి కృషి
- స్కూల్‌కు ప్రహరీ హుళక్కేనా..?



కోతకు సిద్ధంగా ఉన్న జామాయిల్ చెట్లు

ఖానాపురం : గత ప్రభుత్వం నాటిన జామాయిల్ మొక్కలు హరితహారానికే వన్నె తెచ్చేలా ఏపుగా పెరిగాయి. 2016 నుంచి అధికారుల సమష్టి కృషి ఫలితమేనంటూ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలను రక్షిస్తే స్కూల్‌కు ప్రహరీ నిర్మిస్తామన్న నాటి మంత్రి కడియం శ్రీహరి హామీ హుళక్కేనా..? అన్న ప్రశ్న ప్రజల మెదళ్లను తొలుస్తోంది.

హరితహారం కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాటి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు, తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో మండలంలోని ధర్మరావుపేటలోని ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలోని 3 ఎకరాలకుపైగా ఉన్న భూమిలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 2016లో అత్యంత ప్రతిష్టాత్మకంగా సుమారు 4500 జామాయిల్, టేకు మొక్కలు నాటారు. నాటి తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్, వీఆర్వో నూనె వెంకన్న మొక్కల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొక్కలకు నీరు అందించడానికి బోరు సైతం ఏర్పాటు చేయించారు. ప్రతీరోజు మొక్కలకు నీరందిస్తూ కాపాడారు. తహసీల్దార్ పూల్‌సింగ్ బదిలీ అయిన తర్వాత కూడా వాటి సంరక్షణపై నాటి వీఆర్వో చేత ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అనంతరం వచ్చిన తహసీల్దార్లు సైతం తమ వంతు చొరవ చూపారు. అలా పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలు ఇంతింతై వటుడింతై అనే చందంగా భారీ సైజులో వృక్షాలను తలపించేలా ఏపుగా పెరిగాయి. ప్రస్తుతం జామాయిల్ చెట్లు వృక్షాల్లా పెరిగి కోత దశకు చేరుకున్నాయి.

ప్రహరీ నిర్మాణం హుళక్కేనా..?

మొక్కలను నాటి మంత్రి కడియం శ్రీహరి చేతుల మీదుగా నాటారు. మొక్కలను కాపాడుకుంటే పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని నాడు శ్రీహరి హామీ ఇచ్చారు. మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారడంతోపాటు కోత దశకు వచ్చినా ప్రహరీ నిర్మాణాన్ని పట్టించుకున్న దాఖలాల్లేవు. నాటి మంత్రి హామీ నెరవేరకపోవడంపై గ్రామస్తుల్లో అసహనం వ్యక్తమవుతోంది. ప్రహరీ నిర్మిస్తే స్థలాన్ని కాపాడుకోవడంతోపాటు మరిన్ని మొక్కలు నాటవచ్చన్న వాదన వినిపిస్తోంది.

రైతుల సంక్షేమమే ధ్యేయం

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



నెక్కొండ : సీఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

నెక్కొండ : రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. రైతు రుణ మాఫీకి కేబినెట్ సమావేశంలో ఆమోదం తెలిపిన నేపథ్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఫ్లెక్సీకి శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు రాజ్యమని నమ్మించి రుణమాఫీ చేయకుండా వేలాది మంది పేద రైతుల ఉసురు పోసుకుందని గుర్తు చేశారు. రైతన్నల కష్టం తెలిసిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు ప్రాధాన్యత లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పర్వతగిరి : ఆరు గ్యారంటీల్లో భాగంగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీని ప్రభుత్వం ప్రకటించిన సందర్భంగా మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

గీసుకొండ : మండలంలోని గీసుకొండ, కోనాయమాకులలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బీమగాని సౌజన్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్, రైతు సంఘం మండల అధ్యక్షుడు చెరుకుపెల్లి సాంబరెడ్డి, నాయకులు వీరగోని రాజ్‌కుమార్, ఆకుల రుద్రప్రసాద్, దూలం వెంకటేశ్వర్లు, వజ్ర రాజు, నాగారం స్వామి, కొమ్ము శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు గోనె మల్లారెడ్డి, దొడు బాబు, కోల కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ రడం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎంపీపీ కళావతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, పరకాల అధికార ప్రతినిధి రమేశ్ గౌడ్ పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రమేశ్, సీనియర్ నాయకుడు గుమ్మడి హరిబాబు, ఎంపీటీసీలు సంపత్‌రెడ్డి, వీరమ్మ, సుమలత, రజిత, మండల మహిళ అధ్యక్షురాలు సంధ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్షారణ్య పరిరక్షణ సామాజిక బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

నర్సంపేట : వర్షారణ్య పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వయంకృషి సేవా సంస్థ ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ అభివర్ణించారు. ప్రపంచ వర్షారణ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో ఆ సంస్థ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు కాంతారావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రభాకర్ మాట్లాడారు. అడవులు జీవవైవిద్యానికి నెలవులని చెప్పారు. భూగోళం ఉష్ణోగ్రతలను నియంత్రించడంలో కీలకమని తెలిపారు. అడవుల, సహజ వనరుల విధ్వంసం జరగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతీఒక్కరిపైనా ఉందన్నారు. ప్రపంచంలోని వర్షారణ్యాలను రక్షించడం, ప్రోత్సహించడం కోసం ఏటా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2017లో తొలిసారిగా ప్రపంచ రెయిన్ ఫారెస్ట్ డే (వర్షారణ్య దినోత్సవం) ఏటా జూన్ 22న నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. భూఉపరితలంలో ముడింట ఒక వంతు అడవులే ఉన్నాయన్నారు. అడవులంటే కేవలం పచ్చదనమే కాదని, పలు రకాల జీవ, జంతు జాతులకు ఆలవాలమని చెప్పారు. అడవులు వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని, వాతావరణ మార్పు కారణంగా పర్యావరణంలో మార్పు వస్తుందని వివరించారు. వాతావరణ సమతుల్యతను కాపాడడంలో అడవులు ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను అందించడం అడవులు, చెట్ల వల్లే జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

బోరు పక్కనే సెప్టిక్ ట్యాంక్.. అడ్డగింత

వీఆర్‌ఏపై అధికారులకు ఫిర్యాదు

- జీపీ నుంచి నోటీసు
- కఠిన చర్యలు తప్పవు : మంగీలాల్, డీఈ, మిషన్ భగీరథ



బోరు పక్కనే నిర్మిస్తున్న సెప్టిక్ ట్యాంక్

చెన్నారావుపేట : చేతి పంపు (బోరు) పక్కనే సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టగా గ్రామస్తులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిషన్ భగీరథ ఇంట్రా డీఈ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే నిర్మాణం చేపట్టిన వ్యక్తికి గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసు జారీ చేశారు. ఆద్యంతం చర్చనీయాంశంగా మారిన ఈ ఘటన వివరాలిలా..

మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మండల నర్సింహస్వామి చేతి పంపు (బోరు) పక్కనే సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. బోరు పక్కనే సెప్టిక్ నిర్మిస్తే ఇబ్బందులు ఎదురవుతారని నర్సింహస్వామికి నచ్చజెప్పారు. ఆయన వినకపోవడంతో గ్రామస్తులు సంబంధిత శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిషన్ భగీరథ ఇంట్రా డీఈ మంగీలాల్ అక్కడకు చేరుకుని విచారణ చేపట్టారు. చేతి పంపు పక్కనే సెప్టిక్ ట్యాంకు నిర్మించడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. వెంటనే నిర్మాణాన్ని ఆపడంతోపాటు చేపట్టిన పనులను తొలగించాలని చెప్పారు. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని నర్సింహస్వామిని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు పంచాయతీ కార్యదర్శి రాజు నర్సింహస్వామికి నోటీసు జారీ చేశారు. దీంతో పంచాయతీ సిబ్బంది నర్సింహస్వామి నిర్మిస్తున్న ఇంటికి నోటీసు అంటించారు. మండలంలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

ప్రైవేట్ స్కూళ్లల్లో నిబంధనల ఉల్లంఘన



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి జన్ను రమేశ్, డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, ప్రజాసంఘాల నాయకుడు కొత్తకొండ రాజమౌళి ధ్వజమెత్తారు. సదరు పాఠశాలల యాజమాన్యాలపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్డీఓ కార్యాలయ ఏఓకు శనివారం వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం రమేశ్, నాగరాజు, రాజమౌళి మాట్లాడారు. పలు ప్రైవేటు స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ విక్రయిస్తున్నారని తెలిపారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్ లేదని, అనర్హులను డ్రైవర్లుగా నియమించారని, స్కూళ్లలో మౌలిక వసతులూ లేవని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీ నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతోపాటు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కల్లెపల్లి రాకేశ్, కొత్తకొండ అజిత్, సాంబారి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లు

పర్వతగిరి: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని ప్రిన్సిపాల్ పిన్నా శ్రీదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న నేరుగా పాఠశాల కార్యాలయంలో సంప్రదించి విద్యార్థులు అడ్మిషన్లు పొందాలని ఆమె కోరారు.

బుధరావుపేటలోని..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సుల్లో ఉన్న సీట్లను అర్హులైన విద్యార్థులతో భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 24లోపు సర్టిఫికెట్లతో స్కూల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మండలంలోని బుధరావుపేటలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో పీజీటీ ఫిజిక్స్ బోధించడానికి గంటల ప్రాతిపదికన నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, బీఈడీ అర్హత కలిగిన అధ్యాపకులు బయోడేటా, సర్టిఫికెట్లతో ఈనెల 24న కళాశాలలో సంప్రదించాలని సూచించారు. అర్హులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

‘నీట్’పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం



అమరవీరుల స్తూపం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నర్సంపేట : నీట్‌లో జరిగిన అవకతవకలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ నాయకుడు సదిరం వినయ్‌భాస్కర్ విమర్శించారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు దేవోజు హేమంత్ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడారు. నీట్ వల్ల తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వెలిబుచ్చారు. అయినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డితోపాటు బండి సంజయ్ స్పందించడం లేదని మండిపడ్డారు. గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నల్ల రవీందర్, మురహరి రాకేశ్, విష్ణువర్ధన్, ఎర్ర శ్రీకాంత్, బబ్లూ, అజయ్, పట్టణ మైనార్టీ సెల్ కోశాధికారి భోలెమియా, శంకర్, తరుణ్ పాల్గొన్నారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి

పర్వతగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎద్దు రాహుల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం మండలంలోని ఏనుగల్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శనివారం సందర్శించి సమస్యలపై అధ్యయనం చేసింది. అనంతరం రాహుల్ మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ స్కూళ్లను తీర్చిదిద్దుతామని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. తాగునీటి సౌకర్యం కూడా లేదని, ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, విష్ణు, ప్రశాంత్, అశ్రఫ్, తదితరులు పాల్గొన్నారు.

‘జీపీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి’



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

పర్వతగిరి : అవకతవకలకు పాల్పడుతున్న నేపథ్యంలో మండలంలోని భట్టుతండా–2 గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకు శనివారం వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించుకుని, ఇష్టారీతిన తీర్మానాలు చేసి బిల్లులు చెల్లిస్తున్నాడని ఆరోపించారు. ఉపాధి పని చేయని వారికి డబ్బులు చెల్లిస్తున్నాడని తెలిపారు. గ్రామ పంచాయతీ ఆటోను దుర్వినియోగం చేస్తున్నాడని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి అవకతవకలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే మాధవరెడ్డికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలి

ఖానాపురం : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డిని, పార్టీ అధిష్టానాన్ని యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లాగౌడ్ కోరారు. మండలంలోని బుధరావుపేట గ్రామంలో శనివారం నిర్వహించిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా దశాబ్దాలుగా ఎనలేని సేవలు అందిస్తున్న మాధవరెడ్డిని మంత్రి పదవితో తగిన గుర్తింపు ఇవ్వాలని ఆకాంక్షించారు. సమావేశంలో నాయకులు ప్రశాంత్, అనిల్‌నాయక్, నరేశ్, శ్రీకాంత్, రఘు, శ్రావణ్, మొలకల మురళి, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

ఐనవోలు : సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ హరిత అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల సమాఖ్యలో వీఓ సభ్యుల సమక్షంలో సఖి–వన్ స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన సదస్సు ఏపీఎం రాజ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మహిళలు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. విడిపోయే భార్యాభర్తలకు కౌన్సెలింగ్, వరకట్న, లైంగిక వేధింపులు, గర్భవిచ్చితి తదితరాల వేధింపులకు సంబంధించిన అంశాలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. సమస్యలు ఉన్న మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించడంతోపాటు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతి సహాయం సఖి కేంద్రం ద్వారా అందించబడుతుందని తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. వైద్య సిబ్బంది గ్రామాల్లోని సాధారణ మహిళలకు సఖి సేవల గురించి వివరించాలని కోరారు.

గుడుంబా స్వాధీనం

తొర్రూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మడిపల్లి, పెద్దమంగ్యా తండా, చిన్న మంగ్యా తండా, గుర్తూరు గ్రామాల్లో ఎక్సైజ్ పోలీసులు 500 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 12 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో బాధ్యులైన ముగ్గురిపై కేసు నమోదు చేసి తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు. రవాణాకు వినియోగించిన వాహనాలను సీజ్ చేశారు.

యువత వ్యసనాలు వీడాలి

దామెర : యువత చెడు వ్యసనాలు వీడి సన్మార్గంలో పయనించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని కోగిల్వాయిలో శనివారం జాగృతి పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత గంజాయి, గుట్కా, మద్యం వంటి చెడు వ్యసనాల బారినపడి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఆపద సమయంలో 100 టోల్ ఫ్రీకి కాల్‌చేసి సాయం పొందాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళా బృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజ్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.